# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ ఈరోజు తిరుపతిలో జరిగే జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.**

**2. దేశ వ్యాప్తంగా 13 రాష్ట్రాలలోని 88 స్థానాలలో మరి కొద్ది సేపటిలో లోక్ సభ రెండవ దశ ఎన్నికల పోలింగ్ ప్రారంభమవుతుంది.**

**3. లోక్ సభ ఎన్నికలకు సంబంధించి ఉభయ తెలుగు రాష్ట్రాలలో నామినేషన్ల ప్రక్రియ నిన్న ముగిసింది.**

**4. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే సెప్టెంబరు 17 ను తెలంగాణా విమోచన దినోత్సవంగా నిర్వహిస్తామని కేంద్రమంత్రి, భారతీయ జనతా పార్టీ నాయకులు అమిత్ షా పేర్కొన్నారు.**

**5. ప్రపంచ మేథో సంపత్తి దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నా**

**=========================**

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ ఈరోజు తిరుపతి, తిరుమలలో పర్యటించనున్నారు. ఈ ఉదయం 10 గంటల 30 నిమిషాలకు తిరుపతి విమానాశ్రయం చేరుకోనున్న ఉపరాష్ట్రపతి నేరుగా తిరుమలకు వెళ్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం చేరుకుని 3వ స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఉపకులపతి జి.ఎస్.ఆర్.క్రిష్ణమూర్తి ఆకాశవాణికి తెలిపారు. 67 మందికి బంగారు పతకాలు, 580 మంది విద్యార్థులకు పట్టాలను ఉపరాష్ట్రపతి ప్రదానం చేయనున్నట్లు ఉపకులపతి తెలిపారు.

-------------------------

లోక్ సభ రెండవ దశ ఎన్నికల పోలింగ్ కు సర్వం సిద్ధమైంది. దేశ వ్యాప్తంగా 13 రాష్ట్రాలలోని 88 స్థానాలలో మరి కొద్ది సేపటిలో పోలింగ్ ప్రారంభమవుతుంది. కర్ణాటక రాష్ట్రంలోని 14 స్థానాలు , రాజస్థాన్ రాష్ట్రంలోని 13 స్థానాలు , మహారాష్ట్రలో 8 స్థానాలు , ఉత్తర ప్రదేశ్ లో 8 , మధ్య ప్రదేశ్ లో ఆరు , అసోం, బీహార్ లలో అయిదు, ఛత్తీస్గఢ్, బెంగాల్ లలో మూడు , మణిపూర్, త్రిపుర, జమ్ము కాశ్మీర్ లలో ఒక్కొక్క స్థానానికి ఈ రోజు పోలింగ్ జరుగుతోంది. కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ , శశి థరూర్, కేంద్ర మంత్రులు రాజీవ్ చంద్ర శేఖర్, గజేంద్ర సింగ్ షేకావత్, ఓం బిర్లా, బాలీ వుడ్ నటి హేమ మాలిని తదితరులు ఈ రోజు

జరుగుతున్న ఎన్నికలలో పోటీలో వున్నారు. దేశ వ్యాప్తంగా 543 లోక్ సభ నియోజక వర్గాలకు ఏడు విడతలలో జరగనున్న ఎన్నికలలో భాగంగా మొదటి దశ పోలింగ్ ఏప్రిల్ 19 వ తేదీన జరిగింది. ఏడు దశల పోలింగ్ తరువాత జూన్ నాలుగవ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

---------------------------

తెలంగాణాలో మే 13వ తేదీ పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో పని చేస్తున్న మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్ గఢ్ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు తమ రాష్ట్రానికి వెళితే వారికి కూడా వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ లో కూడా మే 13వ తేదీన సెలవు ప్రకటించారు.

---------------------------

తెలంగాణాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు షెడ్యూలు విడుదలైంది. వరంగల్–ఖమ్మం–నల్గొండ ఎమ్మెల్సీ ఉపఎన్నికకు మే 2వ తేదీన నోటిఫికేషన్ వెలువడనుంది. మే 2 నుంచి 9 వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. మే 13 వరకు నామినేషన్ల ఉపసంహరణ, మే 27వ తేదీన ఉదయం 8 గంటల నుండి సాయంకాలం 4 గంటల వరకూ పోలింగ్ జరగనుండగా....జూన్ 5వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది.అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో ఉపఎన్నిక అనివార్యమైంది.

---------------------------

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణా రాష్ట్రాలలో నామినేషన్ల ప్రక్రియ నిన్న ముగిసింది. ఆంధ్ర ప్రదేశ్ లో 25 లోక్ సభ స్థానాలకు 731 నామినేషన్లు , 175 శాసన సభా స్థానాలకు 4 వేల 210 నామినేషన్లు దాఖలయ్యాయి. తెలంగాణా రాష్ట్రంలో 17 లోక్ సభ స్థానాలకు 547 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. తెలంగాణా రాష్ట్రంలో 17 లోక్ సభ స్థానాలతో పాటు కంటోన్మెంట్ శాసన సభా స్థానానికి కూడా మే 13 వ తేదీనే ఉప ఎన్నిక జరగనున్నది. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో నిన్న ఉభయ రాష్ట్రాలలోనూ పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీలకు చెందిన సీనియర్ నాయకులతో పాటు డమ్మి , ఇండిపెండెంట్ అభ్యర్థులు భారీగా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన ఈ రోజు జరుగుతుంది నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29 చివరి తేదీ.

---------------------------

భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే సెప్టెంబరు 17 ను తెలంగాణా విమోచన దినోత్సవం గా నిర్వహిస్తామని కేంద్రమంత్రి, భారతీయ జనతా పార్టీ నాయకులు అమిత్ షా పేర్కొన్నారు.నిన్న సిద్దిపేటలో "విశాల జన సభ "పేరితో నిర్వహించిన బీజేపీ ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సమగ్ర తెలంగాణా వికాసం బీజేపీతోనే సాధ్యమనీ, అందుకోసం రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు గానూ కనీసం 12 లోక్‌సభ స్థానాల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు.

---------------------------

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ అధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలను కోరారు. వైఎస్ఆర్ జిల్లా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన నిన్న నామినేషన్ దాఖలు చేశారు.. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ

పులివెందులను, కడప జిల్లాను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు తను నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ఎక్కడా లంచాలు, వివక్ష లేని పాలన అందించామనీ, పులివెందుల వాసుల చిరకాల కల అయిన వైద్య కళాశాలను త్వరలో ప్రారంభిస్తామనీ జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు.

---------------------------

తాము అధికారంలోకి వస్తే ఐదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయిడు హామీ ఇచ్చారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో నిన్న నిర్వహించిన తెలుగు దేశం , జనసేన, భారతీయ జనతా పార్టీ ఉమ్మడి బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ ఉద్యోగం వచ్చే వరకు 3వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామనీ తెలిపారు. అన్నమయ్య ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకువచ్చి బాధితులను ఆదుకుంటామనీ, పేదలకు ఇంటి స్థలం ఇచ్చి, ఇళ్లు కట్టించి ఇస్తామనీ అన్నారు. గాలేరు-నగరి కాలువ పూర్తి చేసి.. కృష్ణా జలాలు తీసుకొస్తామని చంద్రబాబు నాయిడు పేర్కొన్నారు.

జనసేన పార్టీ అధ్యక్షులు కె. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. రాజ్యాధికారం కొన్ని కుటుంబాల చేతుల్లోనే ఉందనీ,ఆ పరిస్థితి మారాలనీ అన్నారు. రాజంపేట ప్రాంతానికి పరిశ్రమలు తీసుకువస్తామనీ, యువతలో నైపుణ్యాన్ని పెంపొందిస్తామనీ పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.

---------------------------

తెలంగాణా రాష్ట్ర ప్రజలకు భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీలు ఏమీ చేయలేదని రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి విమర్శించారు. హైదరాబాదులోని రాజేంద్రనగర్‌లో నిన్న జరిగిన రోడ్ షో లో ఆయన మాట్లాడుతూ ...రైతులు,మహిళలు, యువత సంక్షేమాన్ని రెండు పార్టీలు విస్మరించాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, గత రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని రేవంత్ రెడ్డి అన్నారు.

---------------------------

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణా రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు కె. చంద్ర శేఖర రావు బస్సు యాత్ర నిర్వహిస్తున్నారు. నిన్న రెండవ రోజున సూర్యాపేట, అర్వపల్లి, తిరుమలగిరి, జనగాం మీదుగా బస్సు యాత్ర సాగింది. భువనగిరిలో ఆయన నిన్న సాయంకాలం రోడ్డు షో లో పాల్గొన్నారు. చంద్ర శేఖర్ రావు మే పదవ తేదీ వరకు బస్సు యాత్ర నిర్వహిస్తారు. దాదాపు ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఆయన బస్సు యాత్ర కొనసాగుతుంది.

---------------------------

ప్రపంచ మేథో సంపత్తి దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. మేథో హక్కులు, కాపీ రైట్లు, ట్రేడ్ మార్కులు, డిజైన్లు నిత్య జీవితంలో ఎటువంటి ప్రాముఖ్యం కలిగి ఉంటాయో తెలియచేసే ఉద్దేశ్యంతో ప్రపంచ మేథో హక్కుల సంఘం ప్రతి ఏటా ఏప్రిల్ 26వ తేదీన ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం 2000 సంవత్సరంలో ప్రారంభించింది. ఆవిష్కర్తలు, సృజనశీలురు ప్రపంచ వ్యాప్తంగా వివిధ సమాజాలకు అందించిన మేధస్సును ఈ రోజు గుర్తించడం ఆనవాయితీ.

---------------------------

దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఒక్క ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం మాత్రమేనని ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయవాడ నగరంలో నిన్న జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ ..... గొప్ప రాజధానీ నగరాన్ని నిర్మిస్తామని ప్రకటించిన ముఖ్య మంత్రి వై ఎస్ జగన్ మోహన రెడ్డి ఆ హామీని విస్మరించారని అన్నారు. వై.ఎస్ ఆర్. కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందనీ, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని కూడా ఆ పార్టీ పట్టించుకోలేదని విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆంధ్ర ప్రదేశ్ కు ప్రత్యేక హెూదా ప్రకటిస్తుందని షర్మిల పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఈ రోజు56 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 174 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. ఎండ తీవ్రత కొనసాగుతుందని.. రేపు 64 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 170 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. నిన్న నంద్యాల జిల్లా నందవరంలో 45.6 డిగ్రీలు, విజయనగరం జిల్లా రాజాంలో 45.5 డిగ్రీలు, అల్లూరి జిల్లా కొండైగూడెంలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లుతెలియచేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ పదవ తరగతి, ఇంటర్ మీడియట్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ ఫలితాలను నిన్న విజయవాడ లో విడుదల చేశారు. పదవ తరగతిలో 18 వేల185 మంది ,ఇంటర్ మీడియట్‌లో 48 వేల377 మంది ఉత్తీర్ణత సాధించారు.

======================